సీఎం పర్యటన వాయిదా

విజయనగరం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన వాయిదా పడింది. గజపతినగరం మండలంలోని పురిటిపెంట గ్రామానికి సీఎం చంద్రబాబు శనివారం రావాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కారణంగా పర్యటన రద్దు అయింది. ఈ విషయాన్ని మంత్రి శ్రీనివాస్ ధ్రువీకరించారు. రాష్ట్రంలోని ఆర్అండ్‌బీ రహదారుల పునఃనిర్మాణానికి ఇక్కడ ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టాల్సి ఉండగా కార్యక్రమం వాయిదా పడింది.



- మద్యం దుకాణాల నుంచి యథేచ్ఛగా సరఫరా
- గ్రామాల్లో వేలంపాటలు
- తగ్గేదేలే అంటున్న వ్యాపారులు
- సీఎం హెచ్చరించినా మారని వైనం

ఎక్కడికక్కడే బెల్ట్

మెంటాడ, నవంబరు 1:

● గజపతినగరం మండలంలోని ఓ గ్రామంలో వేలంపాట ద్వారా బెల్ట్ షాపును అక్షరాలా రూ.11 లక్షల 50 వేలకు దక్కించుకుంది ఓ వర్గం. ఆ బెల్ట్ షాప్‌నకు మెంటాడ మండలంలోని ఓ మద్యం దుకాణం నిర్వాహకుడు గతనెల 30న (మూడురోజులు క్రితం) మద్యం సరఫరా చేస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద నుంచి 200 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు.

● గతనెల 31న మెంటాడ మండలం ఉద్దంగి గ్రామంలోని బెల్ట్ షాప్ నిర్వాహకుడు 45 మద్యం సీసాలతో ఆంధ్ర పోలీసులకు పట్టుబడ్డాడు.ద్విచక్రవాహనం పట్టుబడింది.కేసు నమోదు చేశారు.

● మెంటాడ మండలం రాబంద గ్రామంలో రూ.50 వేలకు బెల్ట్‌ను వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. కొన్నాళ్ల క్రితమే బెల్ట్ నిర్వాహకుడిని పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. అయినా బెల్ట్‌ను గోప్యంగా నిర్వహిస్తున్నారు.

జిల్లాలో నిత్యం ఏదోచోట బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తూ పట్టుబడుతున్న ఉదంతాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. సీఎం చంద్రబాబు హెచ్చరించినా, పోలీసులు దాడులు నిర్వహిస్తున్నా బెల్ట్ షాపులు ఆగడం లేదు. వేలంపాటలు జోరందుకుంటున్నాయి. మద్యం దుకాణం నిర్వాహకులకు సీసాకు రూ.5 నుంచి 10 అదనంగా ఇస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాల ద్వారా రూ.30 నుంచి 50 వరకు క్వార్టర్ బాటిల్‌ను విక్రయిస్తున్నారు. మద్యం దుకాణం నిర్వాహకులు కన్నా బెల్ట్ నిర్వాహకులకే ఎక్కువ కమీషన్ వస్తుండటంతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గడం లేదు.

రాష్ట్రప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టిన నేపథ్యంలో గ్రామాల్లో వేలంపాటల సందడి మొదలైంది. పాటను దక్కించుకునేందుకు ఔత్సాహికుల మధ్య పోటీ వాతావరణం నెలకొంది. కొత్త పాలసీలో భాగంగా కొత్త మద్యం షాప్‌లను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. వేలంపాటల ప్రక్రియ ఊపందుకుంటోంది. ప్రతిరోజూ పరస్పరం మాటల దాడి చేసుకునే స్థానిక రాజకీయ పక్షాలు ఈ విషయంలో మాది ఒకేమాట-ఒకేపాట అని ఐక్యతారాగం ఆలపించడం ఆసక్తికరంగా మారింది.

గ్రామాల్లో బెల్టుషాపుల రూపంలో ఆనధికార మద్యం అమ్మకాలు కొత్తమీకాదు.ఈ గొలుసు దుకాణాలు వేలంపాట ద్వారా ఊరికొకటి చొప్పున ఉంటే,మరికొన్నిచోట్ల వీధికొకటి ఉంటోంది. సంబంధిత యంత్రాంగం పరోక్ష సహకారంతో ఈ వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు హాఫ్‌లుగా విస్తరిస్తూ అధికారులకు సవాల్ విసురుతూనే ఉంది. అదే సమయంలో కొన్నిచోట్ల అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చిమరీ దాడులు నిర్వహిస్తుంటారు. అది వేరే విషయం! మద్యం ఆదాయం పెంపే లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం బెల్టుషాపుల విధానాన్ని అనధికారికంగా ప్రోత్సహించడంతో గొలుసు దుకాణాల సంఖ్య అంతుకుముందుతో పోల్చిచూస్తే వందశాతం పెరిగింది. సూత్రధారి సర్కారే అయినందున యంత్రాంగం కూడా చూసీచూడనట్టు వ్యవహరించింది. దీంతో కొందరు చిల్లర వ్యాపారులే కాకుండా కొందరు వ్యక్తులు కూడా సంచార బెల్టుషాపులను నడిపారు.

సీఎం హెచ్చరించినా..

బెల్ట్‌షాప్ నిర్వహించినా, మద్యంను అదనపు రేట్లకు అమ్మినా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు తాజాగా హెచ్చరించినా బెల్ట్‌లు తగ్గడంలేదు. నిర్వాహణకు రాజకీయ నాయకుల పరోక్ష సహకారం లేనిదే ముందుకు సాగదు. మద్యం షాపులను కొందరు టిడిపి, వైసీపీ నాయకులు దక్కించుకుని సిండికేట్ అయ్యారు. ఎక్కడైనా గ్రామస్థాయి నాయకుడు బెల్ట్ నిర్వహణకు అడ్డుతగిలితే ఆయా పార్టీలకు చెందిననాయకులు రంగంలోకి దిగుతున్నారు.

విలేజ్ సెంటిమెంట్

ఇప్పుడు ప్రభుత్వంతోపాటు పాలసీ కూడా మారడంతో గల్లీ షాపులు, సంచార దుకాణాలు కాకుండా స్థానిక పెద్దలు కూడబలుక్కొని ఊరికో బెల్టుషాపు నినాదాన్ని తెరపైకి తెస్తున్నారు. వేలంపాట ద్వారా వచ్చే డబ్బును గ్రామంలో అభివృద్ధి పనులకు వినియోగిస్తామని విలేజ్ సెంటిమెంట్‌ను రక్తి కట్టిస్తున్నారు. ఏడాది కాలపరిమితితో జరిగే వేలంపాటలో ఎక్కువ మొత్తానికి పాటపాడిన వ్యక్తికి బెల్టుషాపును ఖరారు చేస్తామని, ఈ వ్యక్తి కాకుండా వేరెవరూ అమ్మరాదని,ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని షరతులు విధిస్తున్నారు. ఇది లాభసాటి వ్యాపారమని గతానుభవం చెబుతున్న నేపథ్యంలో ఎవరూ వెనక్కి తగ్గనందున వేలంపాటలో పాల్గొనేందుకు సిద్ధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.పోటీ పెరిగిన కొద్దీ పాటమొత్తంకూడా పెరుగుతున్నా పాటదారులు మాత్రం తగ్గేదేలే అంటున్నారు.ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో వేలంపాటల ప్రక్రియ రహస్యంగా పూర్తిచేసినట్టు తెలుస్తోంది.మిగిలిన చోట్ల కూడా మరో పక్షం రోజుల్లో కొలిక్కి తెచ్చేలా పెద్దలు మంత్రాంగం నడుపుతున్నట్టు సమాచారం.

ఇంటింటికీ తాగునీరేదీ?

- జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన అరకొర కొళాయిలు
- 50శాతం కూడా పనులు పూర్తిచేయలేకపోయిన వైసీపీ ప్రభుత్వం
- ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆర్థిక భారం



ఎస్.కోట శ్రీనివాసకాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన ఇంటింటి కుళాయిలు



ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ఎస్.కోట టీచర్స్ కాలనీ సమీపంలో డంప్ చేసిన పైపులు

శృంగవరపుకోట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):

● జల జీవన్ మిషన్ ద్వారా సురక్షిత జలాలను అందిస్తాం. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలను నిర్మిస్తున్నాం. ఒక వ్యక్తికి 55లీటర్లు చొప్పున మంచి నీరు సరఫరా చేయనున్నాం.

- ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు

● జలజీవన్‌మిషన్ ద్వారా శృంగవరపుకోట శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల నుంచి నేటికీ తాగునీరు సరఫరా లేదు. వీటి నిర్మాణానికి గత ఏడాది డిసెంబర్‌లో పనులు మొదలెట్టారు. ఇంతవరకు ఈ పంచాయతీలో సగభాగం పూర్తిచేయలేదు. శ్రీనివాస కాలనీలో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేసిన గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు సమీపంలో ఉన్న టీచర్స్ కాలనీని విస్మరించారు. పైపులైన్లు, కుళాయిలను వేయలేదు. అక్కడవరకే నిధులున్నాయని, నిధులొస్తే తప్ప వేయలేమని చేతులెత్తేశారు. ఈపంచాయితీకున్న శివారు గ్రామాలను తప్పించి గ్రామంలో ఇంటింటి కుళాయిలకు రూ.4.66 కోట్లు కేటాయించారు. మొదటి విడతగా రూ.2.78కోట్లు విడుదల చేయడంతో గ్రామంలో ఇంటింటి కుళాయిల నిర్మాణం చేపట్టారు. మిగిలిన రూ.1.88 కోట్ల పనులకు టెండర్‌లు పిలవకపోవడంతో మిగిలిన కాలనీల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం చేపట్టలేకపోయారు.

ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకున్న ఇంటింటి కుళాయిల పరిస్థితికి ఈ రెండు ఉదాహరణలు మాత్రమే. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయిల నిర్మాణానికి ఉమ్మడి జిల్లాలో 2019-2020 ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించారు. 2022 మార్చి నాటికి రూ.465కోట్లతో 1920 అవాసాలకు రూ.4.20 లక్షల కుళాయిలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాల పునర్విభజనతో ప్రతిపాదనలు మారాయి. సార్వత్రిక ఎన్నికల నాటికి 35శాతం పనులు కూడా చేయలేకపోయారు. నిధుల విడుదలలో జాప్యం కావడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు నిరాకరించారు. కేంద్రం 45శాతం, రాష్ట్రం 45శాతం, కమ్యూనిటి పర్పస్ కింద రూ.10 శాతం నిధులను భరించాల్సి వుంది. అయితే కమ్యూనిటి పర్పస్ కింద నిధులు రాబట్టడం కుదిరేపని కాకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరించేందుకు ముందుకు వచ్చాయి. అయితే అనుకున్న ప్రకారం కేంద్రం నిధులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన వాటాను సక్రమంగా ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్‌లు పనులు చేపట్టడంలో జాప్యం చేశారు. ఫలితంగా అరకొరపనులు జరిగాయి. కొన్ని టెండర్ దశలోనే నిలిచిపోయాయి. ఇంటింటి కుళాయిల కోసం వున్న చోటే అదనంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, బోర్లు, మోటార్లు, పైపులైన్లు వేసి ట్యాపులు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని చోట్ల పైపులైన్లు వేసి వదిలేశారు. పైపులైన్లు వేసిన దగ్గర కుళాయి కనెక్షన్‌లు ఇవ్వలేదు. ఇవిచ్చి నీటి సరఫరా చేయడం మానేశారు. కొన్ని అవాసాల్లో నీటి లభ్యత లేకపోవడంతో రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు.

ప్రభుత్వంపై ఆర్థిక భారం

జలజీవన్ మిషన్ అమల్లో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరించినట్లు ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన, బిజేపీ కూటమి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను ఇవ్వకపోవడంతో గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఇంటింటికి పూర్తిస్థాయిలో కుళాయిలు ఇవ్వలేకపోయింది. అధికారం చేపట్టిన వెంటనే కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసేపనిలో పడింది. పల్స్ సర్వే చేపట్టింది. ఇంకా 2,15,076 ఇళ్లకు కుళాయిలు వేయాల్సి వున్నట్లు ఈ సర్వే ద్వారా గుర్తించింది. ఇందుకు అవసరమైన ఖర్చంతా ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పడుతుండడంతో అదనపు ఆర్థిక భారం పడనుంది.

డయేరియా విజృంభణ

● నాలుగు గ్రామాల్లో కేసులు ● ఎరుకొండలో ఒకరి మృతి

పూసపాటిరేగ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నడిపల్లి గ్రామంలో మొదలైన డయేరియా మండలంలో విస్తరిస్తోంది. ఎరుకొండ గ్రామాన్నీ చుట్టుముట్టింది. పక్కనే ఉన్న పసుపాం, మర్రిపేట గ్రామాలనుండి కూడా డయేరియా కేసులు రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నడిపల్లిలో సర్పంచ్ గాయత్రి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసి ట్యాంకుల ద్వారా వేరేప్రాంతం నుంచి సరఫరా చేస్తున్నారు. దీంతో కొత్తగా కేసులు రాలేదు. అయితే గురువారం నుంచి పక్కనే ఉన్న ఎరుకొండ గ్రామంలో కేసులు నమోదవుతు న్నాయి. సుమారు 15కు పైగా కేసులు రావడంతో పాటు స్థానికంగా ఉన్న పచ్చిపులుసు వెంకటరమణ(82) విరేచనాలతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. గతంలో అనారోగ్యం లేదని, విరేచనాల కారణంగా ముందుగా భోగాపురం సీహెచ్‌సీకి పంపామని, ఆ తర్వాత జిల్లా కేంద్ర ఆస్పత్రికి, అక్కడి నుండి కేజీహెచ్‌కు తరలించగా శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారని తెలిపారు. అదే విధంగా ఎరుకొండ పక్క గ్రామాలైన పసుపాం, మర్రిపేట గ్రామాల నుంచి కొందరు డయేరియాతో భోగాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఇలా పక్కపక్కనే ఉన్న నాలుగు గ్రామాలకు డయేరియా సోకటంతో అధికారులు తలలు పట్టుకొంటున్నారు.

అధిక క్లోరినేషన్ కారణమా?

అధికారులు డయేరియాకు కారణాలు వెతికే పనిలో పడ్డారు. నడిపల్లిలో వచ్చిన డయేరియాకు దగ్గరలో ఎరుకొండ జంక్షన్‌వద్దనున్న బోరుబావిలో సూపర్‌క్లోరినేషన్ చేశారని, 24 గంటలు గడవకుండానే ఆ నీటిని తీసుకోవటంద్వారా డయేరియా వచ్చి ఉండొచ్చునని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ హేమంత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. క్లోరినేషన్ చేయకముందే గ్రామంలో ఇద్దరికి డయేరియా సోకినట్లు స్థానికులు చెబుతున్నారు. బ్లీచింగ్ స్ప్రేపై ఎంపిడివో రాధికను వివరణ కోరగా బ్లీచింగ్ కొనుగోలు చేయటం తప్ప ప్రభుత్వం తరుపున బ్లీచింగ్ నాణ్యతను తెలియజేసే ఎటువంటి పరికరాలు అందుబాటులో లేవన్నారు.



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

సందడిగా దివ్వెల పండగ

దీపాల వరుసలు.. చిచ్చుబుడ్డీలు, తారాజువ్వల వెలుగులు.. టపాసులు, బాంబుల మోతలు.. ఆకాశ దీపాలతో మహిళలు, చిన్నారుల కేరింతలు.. యువకుల సందడి మధ్య దీపావళిని జిల్లా ప్రజలు గురువారం ఆనందంగా జరుపుకున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఇళ్లను అలంకరించారు. ఆముదం కర్రలు చేతపట్టి తొలిపూజ చేశాక అసలు పండగను ఉత్సాహంగా ప్రారంభించారు. ప్రతిచోటా ఇంటిళ్లిపాదీ బాంబులు పేల్చేందుకు పోటీ పడ్డారు. గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ వెలుగులే వెలుగులు కనిపించాయి. పల్లెల నుంచి పట్టణాల్లో అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌ల వరకూ అందరూ సామూహికంగా దీపావళి పండగను ఉల్లాసంగా నిర్వహించుకోవడం కనిపించింది.

- విజయనగరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి)





క్యాబేజీ కేరాఫ్ వీరఘట్టం

● మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశాలకు ఎగుమతి



4లో

పింఛన్ల పంపిణీలో సర్వర్ సమస్య

జిల్లా వ్యాప్తంగా 96.76 శాతం పంపిణీ



5లో

సకల శుభాల తోరణం.. కార్తీకం

పవిత్ర స్నానాలు.. దానాలు.. పూజలు.. అభిషేకాలు.. ఉపవాస వ్రతాలు.. దీపారాధనలు.. కుంకుమార్చనలు.. వనభోజనాలకు సమయం ఆసన్నమైంది. సకల శుభాల తోరణం.. కార్తీకమాసం వచ్చేసింది. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసంగా చెప్పుకునే ఈ నెలంతా ఆధ్యాత్మిక వాతావరణం ఫరిడవిల్లనుంది. పాడ్యమి, చవితి, పౌర్ణమి, కార్తీకశుద్ధ ఏకాదశి, ద్వాదశి, చతుర్ధశి ఇలా అన్ని రోజులనూ ఎంత నియమనిష్ఠలతో ఆచరిస్తారు. చాంద్రమానం ప్రకారం కార్తీకమాసం ఎనిమిదవది. శరదృతువులో రెండోమాసం. దీపావళి మరుసటి రోజు నుంచి కార్తీకం అరంభం అవుతుంది.. నెల రోజుల పాటు శివాలయాలన్నీ ఓంనమశ్శివాయ నామంతో మార్మోగనున్నాయి.

- విజయనగరం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి)



నెల్లిమర్ల సమీప చంపావతిలో కార్తీక దీపాలు వదులుతున్న దృశ్యం(ఫైల్)

ప్రాజెక్టులూ లేవు.. పర్యాటకమూ లేదు



లైనింగ్ పనులకు నోచుకోని తోటపల్లి కుడి ప్రధాన కాలువ

- వైసీపీ పాలనలో జిల్లాపై చిన్నచూపు ● అన్ని రంగాల్లో వైఫల్యం ● నష్టపోయిన ప్రజానీకం ● కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

విజయనగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా సరైన రహదారులు లేవు. గుంతలనూ పూడ్చలేదు. కొత్త ప్రాజెక్టులు లేవు. ఉన్న ప్రాజెక్టులకు నిధుల తోడ్పాటు లేదు. పంటలకు నీరు లేదు. ఉపాధి అవకాశాల జాడ లేదు.. ఇలా చెప్పుకుంటూపోతే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. జగన్ సర్కారు ప్రజలకు కనీస వసతులు సమకూర్చలేదు. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్యం ఇలా అన్నిరంగాల్లో దారుణంగా విఫలమైంది. వీటిలో ఏ ఒక్క దాని అభివృద్ధిపైనా వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు.

ప్రాజెక్టులు గాలికి...

వ్యవసాయ రంగంలో కీలక పాత్ర సాగునీటి ప్రాజెక్టులదే. కానీ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఉమ్మడి జిల్లాలో తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కనీస కేటాయింపులు కూడా చేయలేదు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగు లక్ష్యం 1,85,221 ఎకరాలు. ఇప్పటి వరకూ 75 శాతం పనులు పూర్తయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 84,356 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.655 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పింది. కానీ విడుదల చేసింది అక్షరాలా రూ.61 కోట్లు మాత్రమే. ఇది ఏ మూలకూ చాలని పరిస్థితి. ఉమ్మడి జిల్లాతో పాటు శ్రీకాకుళం జిల్లాకు సైతం తోటపల్లి నీటిని అందిస్తున్నారు. కానీ శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందించలేకపోతున్నారు. మిగిలిన 46,865 ఎకరాలకు సాగునీరందించాలంటే రూ.140 కోట్లు అవసరమని కూటమి ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. కాలువలు తవ్వేందుకు 25 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

తారకరామదీ అదే పరిస్థితి..

తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును త్వరితగతిన నిర్మించాల్సిన అవసరం ఉంది. రైతుల సాగునీటి అవసరాలు... విజయనగరం కార్పొరేషన్ తాగునీటి అవసరాలు తీర్చాలి. భోగాపురం విమానాశ్రయానికి ఇదే ప్రాజెక్టు నుంచి 5 ఎంఎల్‌డీల నీటిని తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.800 కోట్ల వరకూ ఖర్చయ్యే అవకాశం ఉంది. జలాశయం విస్తీర్ణం 2,200 ఎకరాలు. మొత్తం 9.50 కిలోమీటర్ల పొడవున పనులు పూర్తయ్యాయి. మూడు స్లూయిస్‌లు, మిగతా పనులు పూర్తి చేయాల్సి ఉంది. వట్టిగెడ్డ, వెంగళరావు సాగర్, పెదంకలాం, పెద్దగెడ్డ, తాటిపూడి, ఆండ్ర జలాశయాలదీ అదే పరిస్థితి. నిధులు కేటాయించారు. కానీ విడుదల చేయలేదు. కనీసం జైకా నిధులను సైతం ఉపయోగించలేని స్థితిలో జగన్ సర్కారు పాలించింది.



మెంటాడ మండలం గుర్ల వద్ద కాలువ దుస్థితి

● పర్యాటకం పడకేసింది..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగానికి ఎంత గానో ప్రాధాన్యమిచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. జిల్లా అభివృద్ధిలో తాటిపూడి జలాశయానిది ప్రత్యేక స్థానం. గతంలో ఇక్కడ జల క్రీడా అకాడమీని సైతం ప్రారంభించారు. దీంతో పర్యాటక హబ్‌గా మారుతుందని అంతా భావించారు. కానీ వైసీపీ హయాంలో పనులు నిలిచి పోయాయి. స్థానికంగా గిరి వినాయక్ కాటేజీని నిర్మించారు. సౌకర్యాలు లేకపోవ డంతో అది నిరూపయోగంగా కనిపిస్తోంది. ప్రాజెక్టు చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం, బోటు షికారు, తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ రూ.1.50 కోట్లతో చేసిన ప్రతిపాదనలు బుట్ట దాఖలయ్యాయి.

పెద్ద చెరువునూ వదిలేశారు..

విజయనగరం పెద్ద చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.72 లక్షలతో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. చుట్టూ వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికారాలు, బోటు షికారుకు సైతం ప్లాన్ చేసింది. కానీ వైసీపీ బుట్టదాఖలు చేసింది. టీడీపీ ప్రభుత్వం శిల్పారామాల నిర్మాణానికి అప్పట్లో శ్రీకారం చుట్టింది. 2016లో విజయనగరంలోని వ్యాస నారాయణ మెట్ట వద్ద దీనికి శంకుస్థాపన చేశారు. దాదాపు 40 ఎకరాలను అప్పట్లో కేటాయించారు. తొలిదశలో 8 ఎకరాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. రూ.1.90 కోట్లతో 75 శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

అతీగతీలేని ఆండ్ర..

జిల్లాలోని ఆండ్ర ప్రాజెక్టును పర్యాటక పరంగా తీర్చి దిద్దుతామని అప్పట్లో పాలకులు హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. గుర్ల రిజర్వాయర్‌కు 1997లో నిధులు మంజూరు చేశారు. కానీ ఇప్పటికీ ఆ పనులకు సంబంధించి కదలిక లేదు. నిధులు సరిపోలేదని అప్పటి నుంచీ అలాగే వదిలేశారు. వైసీపీ ప్రభుత్వం అటు వైపు చూడలేదు.

దారుణంగా రహదారులు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులను పట్టించుకున్న పాపాన పోలేదు. అంతర్ రాష్ట్ర రహదారుల నుంచి గ్రామీణ రోడ్ల వరకూ అదే నిర్లక్ష్యం కొనసాగింది. జిల్లాలో ప్రధానంగా విజయనగరం-హడ్డుబంగి రహదారి ఉంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలను కలుపుతూ ఉంటుంది ఈ రహదారి. శ్రీకాకుళం జిల్లా మీదుగా ఒడిశాను కలుపుతూ సాగుతోంది. విజయనగరం నుంచి పాలకొండ వరకూ 64 కిలోమీటర్ల మేర రహదారిని బాగుచేస్తే రవాణా కష్టాలు తీరుతాయి. నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, రాజాం, పాలకొండ పట్టణాల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. దీనికితోడు రోడ్డు ధ్వంసం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి. రాజాం నుంచి పాలకొండ వరకూ ఉన్న రహదారి దారుణంగా తయారైంది. రాజాం పట్టణంలో రోడ్డు నరకాన్ని చూపిస్తున్నాయి.

అప్పట్లోనే అనుమతులు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లోనే విజయనగరం-హడ్డుబంగి ప్రధాన రహదారి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. పీపీపీ విధానంలో రూ.613.91 కోట్లతో రోడ్డు నిర్మించడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. ఈ మార్గంలో నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, రాజాంల వద్ద బైపాస్‌లు నిర్మించాలని ప్రతిపాదించారు. విజయనగరం నుంచి ఒడిశాలోని హడ్డుబంగి వరకూ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించాలని అప్పటి కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలు రావడంతో ఆ ప్రతిపాదన మరుగున పడిపోయింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చిలకపాలెం- రాజాం- రామభద్రపురం రోడ్డు, పార్వతీపురం-కూనేరు రోడ్డు మరొకటి. ఈ రెండు రోడ్లు జిల్లాలో కీలకం. రాజాం నుంచి రామభద్రపురం వరకూ 45 కిలోమీటర్ల మేర రోడ్డు ఉంటుంది. దారి పొడవునా గోతులమయంగా మారింది. ఐదేళ్ల పాటు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా తయారైంది. పార్వతీపురం-కూనేరు రహదారిదీ అదే పరిస్థితి. 20 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా పాడైంది. ఇవి వాహనదారులకు..ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రహదారులకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాబేజీ కేరాఫ్ వీరఘట్టం

- మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశాలకు ఎగుమతి





మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న క్యాబేజీ

వీరఘట్టం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

క్యాబేజీ పంటకు జిల్లాలో వీరఘట్టం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ సుమారు 400 కుటుంబాలు కూరగాయల పంటలు సాగు చేస్తున్నాయి. వీరు సుమారు 200 ఎకరాలలో క్యాబేజీ పంటను సాగుచేస్తారు. కొంతమంది సొంత పొలాల్లో... మరి కొంతమంది భూములు కౌలుకు తీసుకొని 30 సంవత్సరాలుగా దీనిని పండిస్తున్నారు. ఈ సీజన్ వచ్చిందంటే ఇటు వైపు నుంచి ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్యాబేజీ పువ్వులను కొనుగోలు చేసుకుంటూ వెళతారు. ఎందుకంటే ఇక్కడ ధర మిగతా మార్కెట్‌ల కంటే చాలా తక్కువ. కోత దశలో పువ్వును వేరు చేసి పది కేజీల చొప్పున ప్యాక్ చేసి... వ్యాన్‌లలో భువనేశ్వర్, బరంపురం, విశాఖపట్నం, తెలంగాణ ప్రాంతాలకు తరలిస్తారు. ఈ ప్రాంతంలో వీలైనంత వరకు తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వినియోగిస్తారు. క్యాబేజీలో అంతర పంటగా మిరప సాగు చేస్తారు. క్యాబేజీ కోత కోసిన తర్వాత మిరప పంట చేతికి వస్తుందని రైతులు తెలిపారు. ఏడాదిలో 365 రోజులూ ఏదో ఒక కూరగాయల పంటను సాగుచేస్తూ ఉంటామని రైతులు చెబుతున్నారు. క్యాబేజీ, టమాటా, బీర, వంగ, పచ్చిమిర్చిని ప్రధానంగా పండిస్తారు. తమ పంటలను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం తగిన సదుపాయాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కూరగాయలే జీవనాధారం



నాకు ఉన్న ఎకరం పొలంలో ఏటా క్యాబేజీ పంటను పండిస్తున్నాను. ఎకరాకు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. మా దగ్గర నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి... ఇతర రాష్ట్రాలకు కూడా క్యాబేజీ పంటను తీసుకొని వెళతారు.

-తూముల వెంకటరావు, రైతు

కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను



40 సెంట్ల పొలాన్ని కౌలుకు తీసుకొని గత మూడు సంవత్సరాల నుంచి క్యాబేజీ పంటను సాగు చేస్తున్నాను. కార్తీక మాసంలో క్యాబేజీ పంటకు మంచి డిమాండ్ ఉంటుంది. ఆ సమయంలో పంట అందుబాటులోకి వస్తుంది.

-కె.నాగరాజు, రైతు

ఎంతోమందికి ఆధారం



మా గ్రామంలో సుమారు 200 ఎకరాలలో క్యాబేజీ పంటను సాగుచేస్తున్నాం. ఈ పంటపై 400 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం పంటలను నిల్వ చేసే కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

-తూముల గణపతి, రైతు



జిల్లా కేంద్రాసుపత్రి ఇదే..

ఎప్పుడు చెల్లిస్తారో..

- మున్సిపాలిటీకి బకాయిపడిన ప్రభుత్వ కార్యాలయాలు
- కొన్నాళ్లుగా పన్నులు చెల్లించని వైనం

పార్వతీపురం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు మున్సిపాల్టీకి భారీగా బకాయి పడ్డాయి. గత కొన్నేళ్లుగా అవి పన్నులు చెల్లించడం లేదు. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా అయితే అభివృద్ధి ఎలా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మొత్తంగా వివిధ శాఖల నుంచి మున్సిపాల్టీకి పన్నుల రూపంలో రూ.7కోట్ల 24 లక్షల 86 వేలు రావలసి ఉందని రెవెన్యూ విభాగం అధికారి రూబేను బుధవారం తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు ఆ కార్యాలయాలకు నోటీసులు ఇచ్చామని, కలెక్టర్ దృష్టిలో కూడా ఈ విషయాన్ని పెట్టామని ఆయన చెప్పారు.

ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు ఇలా..

- జిల్లా కేంద్రాసుపత్రి రూ.4.94 కోట్లు
- జంఝావతి డివిజన్ కార్యాలయం రూ.47.17 లక్షలు
- పోలీసుశాఖ పాత,కొత్త నివాసాలు, కార్యాలయాలు రూ.35.12 లక్షలు
- సబ్ కలెక్టరేట్ రూ.25.70లక్షలు
- పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం రూ.18.33 లక్షలు
- తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.16.47 లక్షలు
- రైల్వేశాఖ కాలనీలు, వివిధ నిర్మాణాలకు సంబంధించి రూ.11.26 లక్షలు
- ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్ రూ.10.09 లక్షలు
- దేవదాయశాఖ భవనాలకు సంబంధించి రూ.9.51 లక్షలు
- రైతుబజార్ రూ.9.46 లక్షలు
- ఎంపీడీవో కార్యాలయం నుంచి రూ.9.46 లక్షలు
- తపాలా శాఖ భవనాలకు సంబంధించి రూ.8.81 లక్షలు
- సబ్ ట్రెజరీ రూ.7.21 లక్షలు
- ఐటీడీఏ కార్యాలయం రూ.4.53 లక్షలు,
- రెండో అదనపు జిల్లా కోర్టు సముదాయం నుంచి రూ.3.96 లక్షలు,
- ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం నుంచి రూ.3.20 లక్షలు,
- బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రూ.2.63 లక్షలు,
- అటవీశాఖ కార్యాలయం రూ.2.32 లక్షలు,
- పశు సంవర్ధక శాఖ ఆసుపత్రి, కార్యాలయం నుంచి రూ.1.96 లక్షలు,
- పీడీఎం కోర్టు సముదాయం రూ.1.66 లక్షలు
- అగ్నిమాపక శాఖ కార్యాలయం రూ.88 వేలు
- ఏడీఎం కోర్టు సముదాయం నుంచి రూ.34 వేలు



పార్వతీపురం ఆర్డీవో కార్యాలయం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

యువత.. కేరింత

విజయనగరం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని మహారాజా కోటలోని రౌండ్ మహల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఆలపించిన జానపద గీతాలు.. ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.





విభేదాలు సమసిపోయేనా?



- ఇసుక, మద్యం వ్యాపారాల్లో కొందరు తమ్ముళ్ల హస్తం ● ఓ ప్రజాప్రతినిధి తండ్రి పెత్తనం ఎక్కువని గుసగుసలు ● చంద్రబాబు చక్కదిద్దాలంటున్న టీడీపీ శ్రేణులు ● కూటమి పార్టీల మధ్య కూడా విభేదాలు

విజయనగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలంతా గుంభనంగా ఉన్నా లోలోపల విభేదాలు నడుస్తున్నాయి. కొద్దిమందితో కిందిస్థాయి నాయకులకు పొసగడం లేదు. ఓ ప్రజాప్రతినిధి తండ్రి పాత్ర ఎక్కువైందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ నేత చెప్పారు. మద్యం, ఇసుక వ్యాపారాల్లో ఓ ఎమ్మెల్యే దందా సాగిస్తున్నారని, ఇసుక టెండర్ వేసుకున్న వ్యాపారిని కూడా బెదిరింపులకు దిగుతున్నాడనే వార్తలు జిల్లాలో గుప్పుమంటున్నాయి. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి గాజులరేగ నాయకుడు ఇటీవల క్రాకర్స్ దుకాణదారుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారని సమాచారం. ఈ విషయం నేతలందరికీ తెలిసింది. చీపురుపల్లి నియోజకవర్గంలో కీలక నేతపై శ్రేణుల్లో అసంతృప్తి ఉంది. ఆయన అన్నింటా కుమారుడిని ప్రోత్సహిస్తున్నారని, సమీప బంధువును మాత్రం విస్మరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొబ్బిలిలో టీడీపీలో కీలకంగా ఉన్న అన్నాతమ్ముళ్ల మధ్య కోల్డ్‌వార్ నడవడంతో అక్కడ పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శ ఉంది. రాజాం నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లపై పెద్ద నేత పెత్తనం చెలాయిస్తున్నారట. మద్యం వ్యాపారంలోనూ అనుచర వర్గానికి వాటా కావాలని ఒత్తిడి తెచ్చారంటున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో కీలక నేతలు మద్యం దుకాణదారుల నుంచి వాటా తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు పెద్దగా చెప్పుకునే ఓ నేత వేసే ప్రతి అడుగులోనూ తండ్రి పాత్ర ఎక్కువైందంటున్నారు. అతన్ని కలవడానికి వచ్చిన వారందరినీ తండ్రే ముందుగా స్క్రీనింగ్ చేస్తున్నాడంటున్నారు. అలాగే మద్యం సిండికేట్‌లో వాటాలు కావాలని... ఉద్యోగ బదిలీలకు మామూళ్లు కావాలని ఆ తండ్రి అడిగినట్లు చెప్పుకుంటున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు కల్పించుకొని... ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కార్యకర్తలు కోరుతున్నారు.

- కూటమి పార్టీల మధ్య సమన్వయం కూడా లోపించింది. ఇటీవల నెల్లిమర్లలో ఇద్దరు కీలక నేతల మధ్య జరిగిన వాగ్వాదం రాష్ట్రస్థాయిలో చర్చకు దారితీసింది. ఇదే విషయమై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. సవాళ్లు విసురుతున్నారు. చంద్రబాబు దృష్టి సారిస్తే తప్ప సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు.
- విజయనగరం నియోజకవర్గానికి వస్తే ఓ నేతను నమ్ముకుని త్రిమూర్తులు తయారయ్యారు. ల్యాండ్, వైన్, చివరికి దీపావళి సామాన్లు విక్రయించే వ్యాపారుల వద్ద కూడా బెదిరింపులకు దిగినట్టు సమాచారం. ఎమ్మెల్యే రాజకీయాలకు కొత్త కావడంతో ఆమె ఏమి చేయలేని నిస్సహాయ స్థితి. పెద్దాయన కూడా మౌనంగా చూస్తున్నారు.
- శృంగవరపుకోట నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మరో కీలక నాయకుని మధ్య ఎన్నికల సమయం నుంచి మనస్పర్థలు ఉన్నాయి. నేటికీ అక్కడ పరిస్థితి అలానే ఉంది. అధినాయకత్వం పరిస్థితులు చక్కదిద్దాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

టీడీపీతోనే హామీల అమలు సాధ్యం

దీపం -2 పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు **జిల్లా వ్యాప్తంగా ఉచిత గ్యాస్ బండల పంపిణీ**

చీపురుపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే సత్తా కేవలం చంద్రబాబునాయుడికే ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి మాటను ఆయన నిలబెట్టుకున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. దీపం-2 పథకం కింద ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన ఉచిత గ్యాస్ సిలండర్ల పంపిణీని ఆయన శుక్రవారం చీపురుపల్లిలో ప్రారంభించారు. రాష్ట్రంలో 66 శాతంగా ఉన్న గ్రామీణ ప్రజల కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టాలన్న ఆలోచన ఆనాడు ఎన్టీఆర్ చేశారన్నారు. ఆనాటి ఆలోచనను ఇప్పటికీ చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్లు ఎన్. రాజారావు, ఆదిలక్ష్మి, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, సీసీలు, నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బొబ్బిలిలో శుక్రవారం మహిళలకు దీపం 2.0 పథకంలో భాగంగా, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. పథకం అమలులో ఏవైనా సమస్యలుంటే, వినియోగదారులు 1967 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. తహసీల్దార్ శ్రీను, ఎంపీడీవో రవికుమార్, రెవెన్యూ అధికారులు, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యజమాని ప్రసాదరావు, అన్ని శాఖల అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచిత గ్యాస్ పథకం ప్రారంభించారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద నియోజకవర్గ స్థాయిలో ఉచిత గ్యాస్ పథకం ప్రారంభించారు. మహిళలకు ఈ పథకంతో ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. తహసీల్దార్ ఎం.అరుణ కుమారి, ఏపీ టూరిజం కార్పొరేషన్ బోర్డు మెంబర్ ఇందుకూరి సుధారాణి, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ, వబ్బిన సన్యాసినాయుడు తదితరులున్నారు.

రాజాం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళి అన్నారు. శుక్రవారం మేధరవీధిలో లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నాలుగు నెలలకి ఒక ఉచిత సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, ఉరిటి సురేంద్ర, బెహరా తవుడు, వంగా వెంకటరావు పాల్గొన్నారు.



రాజాం: గ్యాస్ పంపిణీ చేస్తున్న కోండ్రు మురళీమోహన్



చీపురుపల్లి: గ్యాస్ సిలండర్లు అందజేస్తున్న కళా



బొబ్బిలిలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



ఎస్.కోటలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

న్యూస్ బాక్స్

వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్టు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్(అకౌంటెంట్) పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్‌లిస్టును వెబ్‌సైట్‌లో పెట్టామని డీఈవో ఎక్స్ అఫీషియో, జిల్లా ఏపీసీ మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రం ఐదు గంటలలోగా తెలియజేయాలన్నారు.

మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలి

బొబ్బిలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో మేదరబంద జంక్షన్ వద్ద గల తాత్కాలిక మద్యం దుకాణాన్ని తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిలో జనావాసాల మధ్య ఇరుకైన ప్రాంతంలో మద్యం దుకాణం ఉంచడం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ పి చిన్నంనాయుడుకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు.

ఫ్యాన్ల వితరణ

రామభద్రపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం రావివలస ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాదల సింహాచలం 2 సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందించారు. కార్యక్రమం లో ఎంఈవో-2 పెంటయ్య, ఐఈఆర్‌పీ చింతల రాజేశ్వరి, జి.తేజశ్విని, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణరంగ కార్డులు పొందండి

శృంగవరపుకోట నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణరంగ కార్డులు పొందాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు సూచించారు. శుక్రవారం శృంగవరపుకోటలో కృషి పెయింటర్ సంఘం, సీతంపేట బాలబంగారం మేస్త్రీల సంఘాలకు అవగాహన కల్పించారు. ఈకార్డుల ద్వారా ఇద్దరు ఆడపిల్లకు రూ.20వేలు చొప్పున వివాహ ఖర్చులకు, ప్రసూతి ఖర్చు, ఐదు లక్షల బీమా, సాధారణ మరణానికి రూ.60వేలు లబ్ధి ఉంటుందన్నారు. పెయింటర్ సంఘ అధ్యక్షుడు స్వామి, అప్పారావు, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు దేముడు, తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కురుపాం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తూ దీపం-2.0 పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా టీడీపీ కురుపాం నియోజకవర్గ కార్యాలయంలో మండల కన్వీనర్ కేవీ కొండయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తెలుగు యువత అధికార ప్రతి నిధి కోలా రంజిత్‌కుమార్, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి, జనసేన మండల కన్వీనర్ ఎన్.వంశీ, టీడీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, చందక రామకృష్ణ, ఆకుల రమేష్, సుకేష్ చంద్ర పండా, నాయకులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే ప్రాధాన్యం

చీపురుపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవలందించిన వారికి పార్టీలో ఎప్పుడూ తగిన ప్రాధాన్యం ఉంటుందని జనసేన పీఏసీ కమిటీ సభ్యుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. భోగాపురంలోని ఓ ప్రవేటు అతిథి గృహంలో తనను కలిసిన చీపురుపల్లి జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, దంతులూరి రమేష్‌రాజు తదితరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. మనోహర్‌ను కలిసిన వారిలో జనసేన నాయకులు, కార్యకర్తలు రౌతు కృష్ణవేణినాయుడు, కింతలి వాసు, ఎడ్ల సంతోష్, రేగాన అప్పలనాయుడు, జనసేన శంకర్ తదితరులున్నారు.

డీటీకి ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు

రేగిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రేగిడి డిప్యూటీ తహసీల్దార్ చిన్నారావుకు ఫుల్ ఎడిషన్ చార్జ్ (ఎఫ్‌ఏసీ) తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఈయన శుక్రవారం నుంచి పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు స్థానిక రెవెన్యూవర్గాలు తెలిపాయి. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎల్లారావు పదవీ విరమణ చేయడంతో డీటీకి తాత్కాలిక బాధ్యతలు అప్పజెప్పారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి: బేబీనాయన

రామభద్రపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సూచించారు. మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టేబుల్ టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన ముల్లు చంద్రశేఖర్ రూ.45వేలతో ఈ క్రీడా పరికరాలను కొనుగోలు చేసి పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ క్రీడలవల్ల మానసిక ఉల్లాసం పెరుగుతుందని, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రావాడ భాస్కరరావు మాట్లాడుతూ పాఠ శాలకు ఆటస్థలం సమస్య ఉందని, ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఇటీవల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తెలుగుదేశం పార్టీ నా యకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కరణం విజయభాస్కరరావు, ముల్లు రాంబాబు, బెవర సీతారాం, తహసీల్దార్ ఆకుల సులోచనరాణి, ఎంపీడీవో రత్నం, పాఠశాల పీఈటీ బొత్స రత్న కిశోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేబీనాయన పాఠశాల విద్యార్థులతో టేబుల్ టెన్నీస్ ఆడారు.

ఘనంగా కామ్రేడ్లు మంగన్న, కోరన్నల వర్ధంతి

కురుపాం రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళ ఉద్యమ సమయంలో అసువులు బాసిన కామ్రేడ్లు మంగన్న, కోరన్నల వర్ధంతి సభను సీపీఎం శ్రేణులు గురువారం మామిడిమానుగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అమర వీరులు స్థూపం వద్ద కామ్రేడ్లకు నివాళులు అర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూడడ్ల కృష్ణమూర్తి జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళ ఉద్యమంలో మంగన్న, కోరన్నలు చూపిన త్యాగం మరువలేనిదన్నారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు మండంగి రమణ, రెడ్డి వేణు, కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఈశ్వరరావు, మండంగి శ్రీనివాసరావు, మండంగి వెంకట్రావు తదితరులు హాజరయ్యారు.

పంటలకు బీమా సౌకర్యం

గరుగుబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలను సాగు చేసే రైతులు విధిగా బీమా ప్రీమియంను చెల్లించాల్సి ఉందని మండల వ్యవసాయశాఖ అధికారిణి రేగిడి విజయభారతి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జీడి మామిడికి సంబంధించి నవంబరు 15లోగా పంటల బీమా ప్రీమియంను చెల్లించాలని ఏవో తెలిపారు. మొక్క జొన్న, వరి, పెసర పంటలకు డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లించాలని వివరించారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి సంధ్యారాణి



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పలు రహదారుల నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. పాచిపెంట మండలంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.4.60 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. వీటితో మండలంలోని పాంచాళి నుంచి కొత్తవలస బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు, గురువునాయుడుపేట నుంచి పూడి వరకు అత్యవసర మరమ్మతులకు రూ.60లక్షలు, కొత్తవలస నుంచి కూనాంబందవలస వరకు రూ. 2కోట్లు చొప్పున వెచ్చించామన్నారు. ప్రభుత్వం ఏర్పడి 125 రోజుల్లో రూ. 4,500 కోట్లుతో 30 వేల పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ, పార్టీ నాయకులు కొత్తల పోలినాయుడు, పల్లేడ ఉమామహేశ్వరరావు, కొరిపల్లి సురేష్, గూడేపు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు. ● మంత్రి సంధ్యారాణి సమక్షంలో శుక్రవారం మోసూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

పింఛన్ల పంపిణీలో సర్వర్ సమస్య

జిల్లా వ్యాప్తంగా 96.76 శాతం పంపిణీ

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెన్షన్ల పంపిణీలో శనివారం ఉదయం సర్వర్ సమస్య వెంటాడింది. దీంతో క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీలో సిబ్బంది అవస్థలు పడాల్సి వచ్చింది. దీంతో పింఛన్‌దారులు కూడా డబ్బుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ పింఛన్ డబ్బులు పంపిణీ చేపట్టారు. తరువాత మొరాయించడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత సర్వర్ పని చేసింది. దీంతో పింఛన్ల పంపిణీ సాగించారు. జిల్లాలోని 277107 మంది పింఛన్‌దారులు ఉండగా, 268131 మందికి పంపిణీ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 96.76 శాతం పంపిణీ చేశారు. ● విజయనగరం రింగురోడ్డు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్య వల్ల విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారం నాడు జరిగిన సామాజిక పెన్షన్‌ల పంపిణీ ప్రక్రియ మందకొడిగా సాగింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడంతో పెన్షన్‌ల పంపిణీ అంతంత మాత్రంగానే సాగింది. మధ్యాహ్నం సర్వర్ పనిచేయడంతో పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు.



ఎల్‌కోట: కేజీహెచ్‌లో రోగికి పింఛన్ అందిస్తున్న రంగరాయపురం డిజిటల్ అసిస్టెంట్

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్

లక్కవరపుకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన బొబ్బిలి చినదేముడు వారంరోజులుగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్‌ను ఆ గ్రామ డిజిటల్ అసిస్టెంట్ కొట్యాడ శ్రీనివాసరావు శుక్రవారం రోగికి అందజేసి వందశాతం పింఛను పంపిణీ పూర్తిచేశారు.

పోషకాహారంపై మరింత అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే ప్రభుత్వ ధ్యేయమని, ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం విధిగా తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాల్సి ఉందని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ని మండల అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రత్యేకాధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఎంపీ డీవో కార్యాలయ ఏవో నాలి అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

బలిజిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బలిజిపేట ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఇంకా తొలగని జగన్ బొమ్మలు



గరుగుబిల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ఆవరణలో జగన్ చిత్రం దర్శనమిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా కొన్నిచోట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మలే దర్శనమిస్తున్నాయి. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలపై జగన్ బొమ్మతో ఉన్న పోస్టర్ ఇప్పటికీ దర్శనమిస్తోంది. అయితే శుక్రవారం ఈ పాఠశాల సందర్శనకు వచ్చిన మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు, పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు వీటిని చూసినా పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం.

పండగ పూట విషాదం

● సముద్రంలో పడి బాలుడి మృతి



దానయ్య (ఫైల్)

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సముద్రంలో పడి బాలుడు మృతిచెందిన ఘటన కొండ్రాజుపాలెంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన గణగళ్ల దానయ్య(15), ఎరుపల్లి రాము, ఎరుపల్లి పోలిరాజు ముగ్గురు స్నేహితులు దీపావళి రోజున ఉదయం 9గంటల సమయంలో సముద్రంలో స్నానానికి వెళ్లారు. కొంత లోపలికి వెళ్లగా భారీ కెరటాలు రావడంతో దానయ్య సముద్రంలోకి వెళ్లి మునిగిపోయాడు. అయితే తీరానికి వచ్చేస్తాడనుకుని స్నేహితులు కొంత సమయం చూశారు. ఎంతకీ రాకపోవడంతో వారు గ్రామంలోకి వెళ్లి విషయం తెలియజేశారు. దీంతో గ్రామస్థులంతా తీరంలో పరిశీలించారు. పడవలతో సముద్రంలోకి వెళ్లి గాలించినా ఫలితం కానరాలేదు. గ్రామమంతా పండగ చేసుకోకుండా విషాదంలో మునిగిపోయింది. అలాగే ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో కిషోర్‌కుమార్ ఘటనా స్థలా నికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 3.30 సమయంలో కొండ్రాజుపాలెం, కొత్తపేట గ్రామాల మధ్య తీరానికి బాలుడి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడు రామచంద్రపేట హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు గణగళ్ల దానమ్మ, తాతయ్యతో పాటు సోదరి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. దానయ్య కుటుంబాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ శుక్రవారం పరిమర్శించారు. తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రాణం తీసిన చుట్ట..

● నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

రాజాం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చుట్ట మంచానికి అంటుకోవడంతో మంటలు రేగి వృద్ధురాలు మృత్యువాత పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రాజాం ఏఎస్‌ఐ రమణమ్మ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం మండలం వి.ఆర్.అగ్రహారం గ్రామానికి చెందిన బెజ్జి చిన్నమ్మి(93) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. గతనెల 31న కుటుంబ సభ్యులంతా పనిమీద బయటకు వెళ్లారు. ఈ సమయంలో చిన్నమ్మి మంచమ్మీద కూచుని చుట్ట కాల్చింది. సగం కాలిన చుట్టను మంచంపైనే వదిలిపెట్టింది. దీంతో మంచానికి నిప్పంటుకుని, దుస్తులు దగ్ధమై ఆమె శరీరం సైతం కాలిపోవడం ప్రారంభించింది. కళ్లు సరిగ్గా కనిపించకపోవడం, ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో కేకలు వేసినా ఫలితం దక్కలేదు. కాసేపటికి ఇంటికి చేరుకున్న చిన్నమ్మి కొడుకు, కుటుంబ సభ్యులంతా శరీరం కొంతభాగం కాలిపోయి ఉన్న వృద్ధురాలిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి 12 గంటల సమయంలో ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు బెజ్జి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్.ఐ. రమణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి

సీతంపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పాలకొండ-హడ్డుబంగి రహదారిపై గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని పైల రామ్మోహనరావు(27)అనే యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ అమ్మన్నరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం ఎన్‌కే రాజపురం గ్రామానికి చెందిన రామ్మోహనరావు, మరో యువతి కొత్తూరు నుంచి పాలకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో పాలకొండ నుంచి కొత్తూరు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు హడ్డుబంగి గ్రామ సమీపంలో ఉన్న మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న పి.రామ్మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న కె.శ్రావణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతుడి తండ్రి పి.శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం

చీపురుపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురంలో గురువారం రాత్రి ఓ ఆటోమొబైల్ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. దీనికి సంబంధించి దుకాణ యజమాని గెంబలి శ్రీనివాసరావు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం దీపావళి పండగ కావడంతో, సాయంత్రం నాలుగు గంటలకు దుకాణాన్ని మూసివేసి, శ్రీనివాసరావు ఇంటికి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి తన దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు సమాచారం వచ్చింది. దీంతో శ్రీనివాసరావు దుకాణానికి వచ్చి, తలుపులు తెరచి చూసే సరికి స్పేర్ పార్ట్స్ ఇతర సామగ్రి మొత్తం కాలి బూడిదై కనిపించాయి. దుకాణంలో సుమారు 60 లక్షల రూపాయల వరకూ సరుకు ఉందని, చిన్న పాటి బోల్టు కూడా బయటికి తీసే అవకాశం లేకపోయిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని, మంటల్ని అదుపు చేశారు. ఇది ఇలా ఉండగా, దివ్యాంగుడైన అగ్ని ప్రమాద బాధితుడు జి.శ్రీనివాసరావును స్థానిక వైసీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు పరామర్శించారు. బీమా పథకం సత్వరమే అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

● రాజాం రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకొండ రోడ్‌లో గురువారం రాత్రి ఎలక్ట్రికల్ షాప్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రూ.1.50 లక్షల విలువైన పైపులు కాలిపోయినట్లు ఫైర్‌ఆఫీసర్ జనార్ధనరావు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా కాల్చిన క్రాకర్స్ షాపులో పడ్డంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాద స్థలానికి సకాలంలో చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చామని ఆయన వివరించారు.

మద్యం విక్రయదారులు అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని ధర్మపురిలో మద్యం విక్రయిస్తున్న పి.అప్పలనాయుడిని అదుపులోకి తీసుకుని తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. గురువారం ధర్మపురిలో తనిఖీలు చేపట్టగా అక్రమంగా మద్యం విక్రయిస్తూ తొమ్మిది మద్యం సీసాలతో అప్పలనాయుడు పట్టుబడినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా

పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని మంత్రి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఉమ్మడి జిల్లాలో శుక్రవారం పంపిణీ చేశారు. ఇళ్లకు వెళ్లి అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం 3వేలు మాత్రమే ఇచ్చేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4 వేలు పంపిణీ చేసిందన్నారు. వారితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గంట్యాడ: నరవలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్



బొబ్బిలి రూరల్: గొర్లెసీతారాంపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న బేబీనాయన



గుమ్మలక్ష్మీపురం: లక్కగూడలో కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి..



రాజాం: మున్సిపాల్టీ పరిధిలోని చిన్నచెరువుగట్టుపై పింఛన్లు పంపిణీ చేస్తున్న కోండ్రు మురళీమోహన్



వీరఘట్టం: లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



గుమ్మలక్ష్మీపురం: గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురం: సిలిండర్ల పంపిణీలో ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మహిళల పక్షపాతి చంద్రబాబు

● ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం

మహిళల పక్షపాతి చంద్రబాబు అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు పరుస్తోందని ప్రజాప్రతినిధులు అన్నారు. శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారు.

● వీరఘట్టం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని వీరఘట్టంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాయి తేజ, తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, కర్నేన అప్పలనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కనుగుల లలిత కుమారి, టీడీపీ మండల కన్వీనర్ చింత ఉమా, పార్టీ వీరఘట్టం అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు పుండరీ, బల్లా హరిబాబు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉచిత గ్యాస్ పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, పార్టీ నాయకురాలు కద్రక కళావతి, తహసీల్దార్ శేఖర్, జీసీసీ మేనేజర్ ప్రసాద్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. ● బలిజిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట గ్యాస్ కార్యాలయం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాలనాయుడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం శుక్రవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు పెంకి రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ● మెంటాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మెంటాడలో దీపం పథకం-2ను టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు శుక్రవారం ప్రారంభించారు. డీటీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు



తోటపల్లి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: తోటపల్లి పెండింగ్ పనులు పూర్తిచేసి రైతులకు పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో తోటపల్లి ఈఈ రెడ్డి రామచంద్రరావు, డీఈలు, ఏఈలు ఎమ్మెల్యేను కలుసుకున్నారు. నిధులు పూర్తిస్థాయిలో రానందున పెండింగ్ పనులు పూర్తిచేయలేకపోతున్నామని, దీంతో రైతులు కూడా సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని రామచంద్రరావు తెలిపారు. దీనిపై నివేదికలు అందజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తామని కోండ్రు అన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయిస్తా

ఆర్అండ్‌బీ బంగ్లాకు పెండింగ్ పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధులు మంజూరుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావుతో కలిసి పెండింగ్ పనులను పరిశీలించారు. ఏ ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయో నివేదికలు అందించాలని ఆదేశించారు. గురవాన నారాయణరావు, టంకాల నాగరాజు, వంగా వెంకటరావు, శాసపు రమేష్‌కుమార్, మరిపి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట రూరల్ నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. శుక్రవారం మండలం లోని బొడ్డవర గ్రామంలో జిందాల్‌కు భూమి ఇచ్చిన ఐదుపంచాయతీల నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరితో రఘురాజు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రోద్బలంతో ఎంతోమంది రైతులు తమ భూములు ఇచ్చి నిర్వాసితులుగా మారారన్నారు. ఇప్పుడు ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేపర్లు, టీవీల్లో ప్రకటనలు ఇస్తున్నారని, భూములు ఇచ్చిన రైతులతో కనీసం సంప్రదించకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో 15 ఏళ్లగా కంపెనీ రాకపోవడం, త్వరలో కంపెనీలు వస్తాయని జరుగుతున్న ప్రచారంపై అన్ని పార్టీల వారితో భారీ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరిశ్రమ పేరుతో నిర్వాసితులతో త్వరలో అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలిసి సమస్య వినిపిస్తామని తెలిపారు. కిల్తంపాలెం, పెదఖండేపల్లి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, జిందాల్ నిర్వాసితులతో పాటు ఆయా గ్రామాల పెద్దలు ఉన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి రూరల్, నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): రంగరాయపురం గ్రామంలో శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు ఏడాదికి 200 రోజులు కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసారు. జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ రమణ, మండల కన్వీనర్ గోపాలం, సభ్యులు తదితురులు పాల్గొన్నారు.

పైడిమాంబను దర్శించుకున్న మంత్రి, ఎంపీ



పైడిమాంబను దర్శించుకుంటున్న మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దీపావళి పండుగ నేపథ్యంలో గురువారం మూడు లాంతర్ల వద్ద ఉన్న పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలతో పాటు అర్చకులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుర్లలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు

గుర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్లలో గత కొంతకాలంగా డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్లకు మరమ్మతులు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న అన్ని పైపులను బయటకు తీసి కొత్తగా పైపులను ఏర్పాటు చేశారు. నీటితోనే ఈ సమస్య వచ్చినట్లు తెలపడంతో వెంటనే అధికారులు చర్యలు చేపట్టారు. పూర్తిగా పైపులైన్‌ను ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

పాలధరపై దృష్టి సారించాలి



జామి: పాడిరైతుల సమస్యలను మంత్రికి వివరిస్తున్న దృశ్యం



లక్కవరపుకోట: ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జామి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ ఆవుపాల ధర తగ్గించడంతో పాడి రైతులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని, వీరి సమస్యపై మంత్రి కొండపల్లి శ్రీనువాసరావు దృష్టి సారించాలని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం రైతుసంఘ నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో మంత్రిని కలిసి, పాడిరైతుల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతుల సంఘం, పాలరైతుల సంఘం ప్రతినిధులు ఉన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి

లక్కవరపుకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ సీఐటీయు నేతలు ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పాడిరైతులతో కలసి ఆమె నివాసంలో సమస్యలపై చర్చించారు. విశాఖ డెయిరీ ఆవు పాల ధరను 2 నుంచి 4 రూపాయల వరకు తగ్గించేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతులకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగిపోయాయని తెలిపారు. ఆవు పాలు రూ.50లు, గేదె పాలు రూ.80లకు కొనుగోలు చేసేటట్లు డెయిరీని ఒప్పించాలని కోరారు. ఉత్తరాంధ్ర మొత్తంగా విశాఖ డెయిరీకి సుమారు 9లక్షల మంది రైతులు పాలు పోస్తున్నారని, పాల రేటు తగ్గించడంతో వీరంతా ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.కృష్ణమూర్తి, అప్పారావు, మద్దెల రమణ, తరిని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల, గుర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లిమర్ల మండలంలోని అలుగోలు, కొత్తూరు, పల్లెపేట, జోగిరాజుపేట, గుషిణి, చనమల్లుపేట, బర్లపేటలతో పాటు గుర్ల మండలం రాగోలులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పూసపాటిరేగ, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో కార్తీక్, మహేష్, అండర్-17 విభాగంలో పి.మహేష్ ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-14లో ఖోఖోకు ఎ.ఉదయ్‌కుమార్, వై.అమృత ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీలో చేరిక

గంట్యాడ, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): నరవ గ్రామానికి చెందిన 26 కుటుంబాలు వైసీపీని విడిచి మంత్రి శ్రీనివాస్ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ సుంకరి రామునాయుడు, పార్టీ నాయకులు సుంకరి సాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

ఆరు సబ్ స్టేషన్లకు ప్రతిపాదనలు

శృంగవరపుకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఎస్.కోట మండలం బాలకృష్ణరాజపురం, కొత్తవలస మండలం అర్థన్నపాలెం, మంగళపాలెం వేపాడ మండలం వావిలపాడు, ఎల్.కోట మండలం చందులూరు గ్రామాల పరిధిలో కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చానని చెప్పారు. ఏపీఈపీడీపీఎల్ సీఎండీ పరిశీలన చేస్తున్నారన్నారు. త్వరలో మంజూరవుతాయని తెలిపారు.

మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలండర్ల పంపిణీ పథకం ప్రారంభంలో భాగంగా ముందస్తుగా విజయనగరం జిల్లా భోగాపురం మండలం సన్‌రే రిసార్ట్సుకు వచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే నాగమాధవి బుధవారం అర్ధరాత్రి ఘనంగా స్వాగతం పలికారు. గురువారం ఉదయం విజయనగరం జిల్లాకు చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు ఆయన్ని కలిసి, పరిచయం చేసుకున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు.

● నెల్లిమర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన పార్టీ నాయకుడు చనమల్లు వెంకటరమణ గురువారం సన్‌రే రిసార్ట్స్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు పడాల అరుణ, పార్టీ నాయకుడు పతివాడ గోవిందరావు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

బాడంగి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏరోడ్రామ్ దగ్గర మంచి నీటిని అందించే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పోల మహేశ్వరరావు తెలిపారు. ఏరోడ్రామ్ వద్ద విద్యుత్ స్తంభాల కోసం పనులు చేస్తున్న క్రమంలో పైపులైను పాడయ్యింది. దీంతో శుక్రవారం తాగునీటి సరఫరా నిలుపుదల చేసి, మరమ్మతులు పూర్తి చేశామని ఆయన తెలిపారు. శనివారం నుంచి తాగునీటిని మండలంలోని గ్రామాలకు సరఫరా చేస్తామని ఆయన వివరించారు.

దేవుపల్లిలో వైద్య శిబిరం

బొండపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్‌కేర్ ఆన్ వీల్స్ సంచార వైద్య శిబిరాన్ని యూనివర్సిటీ డైరక్టర్ బాబా శంకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. రోగులకు రక్తపరీక్షలు, షుగర్, కొలస్ట్రాల్ వంటి పరీక్షలను నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో కూడా ఈ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలను అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు చైతన్య, నాయకుడు రాపాక అచ్చింనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులకు అండగా ఉంటాం

● టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బంగార్రాజు



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. శుక్రవారం నెల్లిమర్లలో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎమ్మెల్యే నాగమాధవి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుపై ఇప్పటికే అధిష్టానానికి నివేదించామని చెప్పారు. అధిష్టానం జోక్యంతో పరిస్థితులు చక్కబడతాయన్నారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, పార్టీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మినాయుడు, కంది చంద్రశేఖర్, కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్‌కుమార్, విక్రమ్ జగన్నాథం, పసుపులేటి గోపి, గేదెల రాజారావు తదితరులు ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజల సొమ్మును రికవరీ చేయాలి

బొబ్బిలి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి గ్రామంలో 108 డ్వాక్రా గ్రూపుల్లో అవకతవకలు జరిగాయని, దీనిలో సంబంధిత అధికారుల హస్తం ఉందని అలజంగి గ్రామ పెద్దలు, డ్వాక్రా మహిళలు కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు ముందు విన్నవించుకున్నారు. దీనికి స్పందించి, ఆయన ఈ విషయమై యూనియన్ బ్యాంక్ అధికారులను ఆధారాలతో శుక్రవారం కలిసి ప్రశ్నించారు. ఇందులో కొంత మొత్తం అవినీతి జరిగిందని బ్యాంకు అధికారులు జవాబు ఇచ్చారు. 2012 నుంచి నేటి వరకు జరిగిన డ్వాక్రా గ్రూపు లావాదేవీలలో కోట్లాది రూపాయలు అలజంగి గ్రామంలో వీవోఏ ఆధ్వర్యంలో ప్రజల సొమ్ము చేతులు మారిందని, వివోఏ అధ్వర్యంలో పక్కదారి పట్టిన సొమ్మును ఉన్నతాధికారులతో సోషల్ ఆడిటింగ్ జరిపి, ఈ సొమ్ము ను రికవరీ చేయాలని కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్చార్జి మువ్వల శ్రీని వాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకు లు మండపాక శ్రీనివాస రావు, అలజంగి గ్రామ పెద్దలు, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద ఆందోళన

శృంగవరపుకోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటరమణ పేటకు చెందిన గర్భిణి కందికట్ల రమ్య స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అక్టోబరు 23న చేరింది. సుఖప్రసవం కాకపోవడంతో రాత్రి 8గంటల సమయంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయడంతో మగ శిశువు జన్మించింది. అయితే ఈ శిశువుకు పేగులు బయటకు వచ్చి ఉండడంతో కుటుంబ సభ్యులకు ఆసుపత్రి యాజమాన్యం విషయం తెలియజేసి, మెరుగైన వైద్యానికి శిశువును విశాఖ పట్టణం తరలించింది. తల్లికి మాత్రం ఇక్కడే వైద్యం అందిస్తున్నారు. అయితే అక్టోబరు 31న (గురువారం) బాధిత కుటుంబసభ్యులు వైద్యులు చేసిన తప్పిదం వల్లే శిశువు పేగులు బయటకు వచ్చాయని యాజమాన్యంతో గొడవకు దిగారు. విశాఖపట్టణంలోని కార్పోరేట్ ఆసుపత్రిలో శిశువు చికిత్సకు అవుతున్న వైద్యఖర్చులన్నింటినీ భరించాలంటూ డిమాండ్ చేశారు. మళ్లీ తిరిగి శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో పెద్ద సంఖ్యలో వచ్చిన కుటుంబసభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగడంతో పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సాయంత్రం 5గంటల సమయంలో మధ్యవర్తుల రాజీ ప్రయత్నాలతో రూ. 3.50 లక్షలు బాధిత కుటుంబానికి ఇచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించింది. దీంతో గొడవ సద్దుమణిగింది. ఆపరేషన్‌లో జరిగిన తప్పిదం వల్ల శిశువుకు పేగులు బయటకు రాలేదని, వైద్యపరిభాషలో దీన్ని గ్యా స్ట్రోసిస్ అంటారని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.

విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన

● విజయనగరం జిల్లా కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ

విజయనగరం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విజిలెన్సు వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం విజయనగరం ఏసీబీ సీఐ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎల్ఐసీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ, దేశ శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకుని సమగ్రత, సాంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. అవినీతిని అంతమొందించేందుకు రాష్ట్ర ఏసీబీ డీజీ అతుల్‌సింగ్ ఆదేశాలతో ఈ విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహించి, విద్యార్థులతో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో సాయి డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల విద్యార్థులతో పాటు ఏసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం పురపాలక సంఘం
ఇ-ప్రోక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

టెండర్ నోటీ నెం 163 to 165/2024-25/ E1-Rajam Municipality Dt: 01-11-2024.రాజాం మునిసిపాలిటి పరిధిలో పురపాలక సంఘం సాధారణ నిధులు (2024-2025)తో ఇ-ప్రోక్యూర్‌మెంట్ ద్వారా షార్ట్ టెండరు పిలువబడుచున్నవి.

పనుల సంఖ్య : 03 కాంట్రాక్టు విలువ :రూ.5.11/- లక్షలు

Details	Date and Time	
1. Bid Document Downloading Start Date	02-11-2024	11.00AM
2. Bid Document Downloading End Date	11-11-2024	3.00PM
3. Last Date & Time for Receipt of Bids	11-11-2024	5.00PM

నోటు: ఇతర వివరముల కొరకు ఈ దిగువ తెలియజేసిన ఫోన్ నెంబర్లను సంప్రదించవలెను, ఆఫీసు పనిచేయు సమయములో తెలుసుకొనగలరు మరియు ఇ-ప్రోక్యూర్‌మెంట్ వెబ్ సైట్ ను చూడవలెను.

Commissioner, Rajam municipality
Ph.No.9849905797,&
visit us. @ www.tender.apeprocurement.gov.in

sd/-COMMISSIONER,
Rajam Municipality.